క్లుప్తంగా

ఓటు హక్కు వినియోగించుకోండి

ఇల్లెందు: అర్హులైన ప్రతీ ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని స్వీప్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ బయ్యారం ఇమ్మానియేల్, బాలరాజు కోరారు. శుక్రవారం పట్టణంలో పలు ప్రదేశాలలో ఓటు హక్కు వినియోగంపై కళాజాతా నిర్వహించారు. ఎన్నికలు సజావుగా అత్యధిక పోలింగ్ జరిగేలా ప్రతీ ఓటరు పాటుపడాలని కోరారు.

డాక్టర్ బుచ్చయ్యకు సన్మానం



డాక్టర్ బుచ్చయ్య దంపతులను సన్మానిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

పాల్వంచ: వైద్యంలో డాక్టర్ నామా బుచ్చయ్య సేవలు మరువలేనివని మెడికల్ ఆఫీసర్ కృష్ణకుమారి అన్నారు. పట్టణంలోని శేఖరం బంజర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడిగా పనిచేస్తున్న నామా బుచ్చయ్య శుక్రవారం ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చయ్యను ఘనంగా సన్మానించారు. బుచ్చయ్య మాట్లాడుతూ.. తనకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ, స్థానిక ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా రమేశ్



పాల్వంచ: కాంగ్రెస్ పార్టీ పాల్వంచ మండల అధ్యక్షుడిగా గద్దల రమేశ్‌ను నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య నియామక పత్రాన్ని శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కృషి చేస్తామని చెప్పారు. గ్రామస్థాయి నుంచి ప్రతి ఇంటికి కాంగ్రెస్ మేనిఫెస్టోను తీసుకెళ్తామన్నారు. తనను నియమించిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసు నిఘా పటిష్టం

టేకులపల్లి: ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో పోలీసు నిఘా మరింత పటిష్టం చేస్తున్నారు. నగదు, మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు, ఎన్నికల సంఘం ప్రతినిధులు, పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శుక్రవారం టేకులపల్లి మండలంలోని బొమ్మనపల్లి పంచాయతీ కారుకొండ క్రాస్‌రోడ్డు వద్ద పోలీసు చెక్‌పోస్టుని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది, వీడియో గ్రాఫర్, హోమ్‌గార్డు తదితరులు వచ్చేపోయే వాహనాలను తనిఖీ చేస్తున్నారు.

దుస్తులు వితరణ



మాట్లాడుతున్న భవానీ ప్రసాద్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో వాసవీ క్లబ్, వాసవీ వనిత విజయం వారి ఆధ్వర్యంలో వనవాసి కళా పరిషత్‌లో శుక్రవారం పేదలకు దుస్తులు వితరణగా అందించారు. ఈ సందర్భంగా మొరిశెట్టి భవానిప్రసాద్ మాట్లాడుతూ.. మొరిశెట్టి పూర్ణచందర్‌రావు, సుధల గుర్తుగా వనవాసి కళాపరిషత్ వారి ఆధ్వర్యంలో పది మండలాల్లో 100 మందికి దుస్తులు అందజేసినట్లు వివరించారు.

కాంగ్రెస్‌కు టీజేఎస్ మద్దతు

పాల్వంచ: వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను గద్దె దింపాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ జనసమితి పూర్తి మద్దతు తెలుపుతుందని జిల్లా కన్వీనర్ బరగడి దేవదానం అన్నారు. శుక్రవారం పాల్వంచలో జిల్లా ప్రధాన కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. దేవదానం మాట్లాడుతూ... కేసీఆర్ ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని రూ.లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి తీసుకొచ్చారని విమర్శించారు. కేసీఆర్‌ను గద్దె దింపేందుకు టీజేఎస్ శక్తివంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో షేక్ గౌస్, శివ, కేశవపట్ల లక్ష్మి, పిప్పాల శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హామీ ఇచ్చారు. శుక్రవారం రాత్రి రుద్రంపూర్‌లో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల పరిరక్షణ సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్మికులు బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం కార్మికులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీకి అందజేశారు.

మీ సేవా కేంద్రం కిటకిట

- ఆధార్ లింక్ కోసం ఇబ్బంది పడుతున్న ప్రజలు
- మరో రెండు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్



ఆధార్ లింక్ కోసం మీ సేవా కేంద్రం తలుపులు తెరుచుకోక ముందే క్యూ కట్టిన జనం

ఇల్లెందు: అసలే ఎన్నికల వేళ కుల ధ్రువీకరణ పత్రాల కోసం అసెంబ్లీకి పోటీ పడుతున్న అభ్యర్థులు, వారి తాలూకా ప్రతినిధులు ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తుండగా అక్కడ ఆధార్ లింక్ కోసం వచ్చిన జనం క్యూకట్టి ప్రజలు. రెండు నెలలుగా ఆధార్ లింక్ కోసం పల్లెల నుంచి ఇల్లెందుకు రోజుకు వందల మంది వచ్చి కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఏ కంప్యూటర్ ముందైనా రోజుకు 50 నుంచి 60 మందికి మించి లింక్ కావటం లేదు. ముఖ్యంగా మున్సిపాలిటీలోని మీ సేవా కేంద్రంలో మూడు కంప్యూటర్లు ఉన్నాయి. వీటిలో వివిధ రకాల పనులకు వీటిని కేటాయించారు. కొంతకాలంగా ఆధార్ లింక్ ప్రక్రియ కోసం జనం ఎగబడుతుండటంతో ఈ మూడు కంప్యూటర్లు ఆధార్ లింక్ పనులే చేస్తున్నాయి. అయినా రోజుకు 200 మందికి లోపే లింక్ చేస్తుండటంతో గుండాల– ఆళ్లపల్లి, టేకులపల్లి, కారేపల్లి, బయ్యారం మండలాలకు చెందిన వారితోపాటు మారుమూల ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో వచ్చి చేరుతుండటంతో క్యూ కట్టాల్సి వస్తోంది. దీనికి తోడు విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలు వదిలి ఆధార్ లింక్ కోసం వస్తుండటంతో అటు పాఠాలు వదిలి ఇటు రోజంతా ఆధార్ సెంటర్ వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఆధార్ లింక్‌కు కటాఫ్ డేట్ లోపల ముగించాలని ఉన్నట్లు స్పష్టమైన సమాచారం లేకపోయినప్పటికీ ఒక్కసారిగా ప్రజలు భారీ సంఖ్యలో సుదూర ప్రాంతాల నుంచి తెల్లారేసరికి సెంటర్ ముందు ప్రత్యక్షం అవుతుండటంతో ఆపరేటర్లు కూడా రేయంబగవళ్లు కష్టపడుతున్నారు.

లింక్‌కు తప్పని చిక్కులు...

ఆధార్ లింక్ కోసం మారుమూల గ్రామాలతో పాటు ఇతర మండలాల నుంచి భారీ సంఖ్యలో వస్తున్న వారికి అనేక చిక్కులు ఎదురవుతున్నాయి. ఈ మీ సేవా కేంద్రాల్లో ఉన్న పురాతన కంప్యూటర్లు, స్కానర్లు, ప్రింటర్లు ఎప్పుడు మరమ్మతుకు వస్తాయో అంతుపట్టని పరిస్థితి. ఏది మొరాయించినా గంటల కొద్దీ పని నిలిచిపోతోంది. దీనికి తోడు జనరేటర్లు, బ్యాటరీలు, సోలార్ సదుపాయం లేకపోవటం వల్ల కరెంట్ పోయినప్పుడల్లా పనులు నిలిచిపోతున్నాయి. ఇటీవల కాలంలో విద్యుత్ అంతరాయం, మరమ్మతుల పేరుతో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారు. ఇలా అనేక చిక్కులు ఎదురవుతున్నాయి.



దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు

ప్రభుత్వ ఆధీనంలో లేని మీ సేవా కేంద్రాలు...

పక్కా భవనాలు నిర్మించి మీ సేవా కేంద్రాలను నెలకొల్పిన ప్రభుత్వం కొంతకాలం తర్వాత వాటి మెయింటెనెన్స్‌ను ప్రైవేట్ వారికి అప్పగించింది. ఆనాటి నుంచే వాటికి గ్రహణం పట్టింది. ప్రైవేట్ వారికి కూడా సకాలంలో నిధులు చెల్లించటం లేదు. ఆలనా– పాలనా గాలికి వదిలేసింది. కనీసం ఈ మీ సేవా కేంద్రాల్లో మంచినీటి సదుపాయం గానీ, మూత్రశాలలు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించలేదు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు దాహం తీర్చుకునేందుకు అల్లాడుతున్నారు. ఈ మీ సేవా కేంద్రాల్లో ఉన్న పురాతన ఫర్నీచర్ పనికి రాకుండా పోయి కుప్పలు కుప్పలుగా ఓ మూలన పడేశారు.

అదనపు బాదుడు..

మీ సేవా కేంద్రాల్లో ఏ పనికి ఎంత తీసుకోవాలన్నా దాని మీద ప్రభుత్వమే నిర్ధారించి రేటు నిర్ణయించింది. అయితే ఇక్కడ ఏ పనికైనా అదనపు బాదుడు షరామామూలే. తొందరగా పని కావాలంటే ఆపరేటర్లను ప్రసన్నం చేసుకుంటే అదనంగా డబ్బు చెల్లిస్తే పనులు నడుస్తున్నాయి. కష్టనష్టాలకు ఓర్చి మీ సేవా కేంద్రాలకు చేరితే సకాలంలో పనులు అవుతాయన్న గ్యారంటీ లేకుండా పోయింది. అదనపు బాధుడుతో సామాన్యులు లబోదిబోమంటున్నారు.

100 కిలోమీటర్ల నుంచి వచ్చిన..



100 కిలోమీటర్ల దూరం నుంచి ఇల్లెందుకు రెండు రోజులుగా తిరుగుతున్నాము. ఆధార్ లింక్ చేస్తే పిల్లలు బడికి పోతారు. లింక్ చేయకుండా బడికి పంపిస్తే ఏదైనా ప్రభుత్వ పథకం అందదని చెబుతున్నారు. అందుకే ఎంత ఇబ్బంది అయినా వస్తున్నాం. అయినా పని కావడం లేదు.

– పి.కృష్ణ, రామాంజిగూడెం, ఆళ్లపల్లి మండలం

మూడు రోజులుగా వస్తున్నా..



ఆధార్ లింక్ కోసం మూడు రోజులుగా ఇల్లెందు మీ సేవా కేంద్రానికి వస్తున్నాను. ప్రతీరోజు 50 మంది వరకు ఆధార్ లింక్ చేస్తున్నారు. మూడు కంప్యూటర్లే ఉన్నాయి. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ ఇబ్బందులను గుర్తించి అధికారులు ఎక్కువ సెంటర్లను ఏర్పాటు చేయాలి.

– కె.ప్రేమ్‌కుమార్, ధారపాడు, టేకులపల్లి మండలం

నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

ఇల్లెందు: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభం అయింది. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎన్నికల అధికారి కాశయ్య సహాయ ఎన్నికల అధికారులతో కలిసి నామినేషన్ల స్వీకరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్నికల కేంద్రం వద్ద విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇతరులు లోపలకు రాకుండా 100 మీటర్ల దూరంలో నిలిపివేశారు. నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థుల వెంట ఐదుగురిని కేంద్రంలోకి అనుమతించారు. ఇందుకు గాను ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. అంతేగాక ఏదైనా సమాచారం కోరే వారి కోసం ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేశారు. వీడియో, ఫొటో గ్రఫీలతో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని కవర్ చేస్తున్నారు. నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం వద్ద ఎలాంటి అవాంతరాలు జరుగకుండా పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ఆయన వెంట సహాయ ఎన్నికల అధికారులు రవికుమార్, కృష్ణవేణి, భగవాన్‌దాస్ తదితరులు ఉన్నారు.

ముందస్తు బైండోవర్...

వివిధ రాజకీయ పక్షాల నాయకులను ముందస్తు బైండోవర్ చేస్తున్నారు. ఈ నెల 10 వరకు నామినేషన్లు దాఖలుకు గడువు ఉండగా 5వ తేదీ ఆదివారం సెలవు దినం కావటంతో ఆ రోజు నామినేషన్లు స్వీకరించబడవని తెలిపారు. 13న నామినేషన్ల పరిశీలన, 15న ఉపసంహరణ తుది జాబితా వెల్లడించనున్నారు. అదేరోజు గుర్తులు కేటాయించనున్నారు. నవంబర్ 30న ఎన్నికలు, డిసెంబర్ 3న కౌంటింగ్ ఉంటుందని అధికారులు ప్రకటించారు.



ఇల్లెందు రిటర్నింగ్ అధికారి కార్యాలయం

ఇల్లెందులో తొలి నామినేషన్ దాఖలు..

ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గానికి శుక్రవారం తొలి నామినేషన్ దాఖలైంది. యూసీసీఆర్(ఎంఎల్) అభ్యర్థి పోలెబోయిన రవి తన నామినేషన్ పత్రాన్ని ఎన్నికల అధికారి కాశయ్యకు అందజేశారు. తొలిరోజు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగానే రవి నామినేషన్ పత్రాలు స్వీకరించి మధ్యాహ్నం తర్వాత తన మద్దతుదారులతో తరలి వచ్చి దాఖలు చేశారు. కామేపల్లి మండలం అడవి మద్దులపల్లి గ్రామంలో నివాసం ఉంటూ చిన్ననాటి నుంచి కూడా గ్రామీణ పేదల సంఘంతో సత్సంబంధాలు కలిగి ప్రజా సమస్యలపై రాజీ లేని పోరాటాలు చేస్తున్నట్లు రవి తెలిపారు.

ఇంటింటికీ బీఆర్‌ఎస్ శ్రేణులు



ప్రచారం నిర్వహిస్తున్న మదన్‌లాల్

జూలూరుపాడు: బీఆర్‌ఎస్ పార్టీ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి మదన్‌లాల్, ప్రస్తుత వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్‌తో కలిసి వినోభానగర్ నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. వినోభానగర్, సురారం, గుండెపుడి, రామచంద్రాపురం, నల్లబండబోడు, అనంతారం తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి మదన్‌లాల్ ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో యల్లంకి సత్యనారాయణ, పోలుదాసు గోపాలకృష్ణమూర్తి, ఎదళ్లపల్లి వీరభద్రం, లావుడ్యా సోనీ, భూక్యా కళావతి, గాదె నిర్మల, మూడ్ చిట్టిబాబు, చావా వెంకటరామారావు, దుద్దుకూరి నాగేశ్వరరావు, సాయిల నాగేశ్వరరావు, సాయిన్ని లక్ష్మణ్‌రావు, శ్రీనివాసరావు, భూక్యా రాములు, భూక్యా శిరీష, కొడెం సీతాకుమారి, మంగముడి నాగేశ్వరరావు, కంచర్ల సూర్యప్రకాష్ మాళోత్ నరసింహారావు, చాపలమడుగు రామ్మూర్తి, ధరావత్ నాగేశ్వరరావు, నిమ్మటూరి కనకయ్య, బానోత్ హరిలాల్, చందర్, తాళ్లూరి రామారావు, పుల్లయ్య పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

జూలూరుపాడు: ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడిగా జూలూరుపాడుకు చెందిన అనుమల్ల భద్రయ్య ఎన్నికయ్యారు. శుక్రవారం గుండెపుడి ఆర్కే ఫంక్షన్ హాల్‌లో ఫొటో, వీడియో గ్రాఫర్ల సమావేశం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు కీసరా సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫొటో గ్రాఫర్ల సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా ఇడుపుల సాంబ, ఉపాధ్యక్షుడిగా భూక్యా రమేష్, కోశాధికారిగా ఎస్కే మన్సూర్ అలీ, గౌరవ అధ్యక్షుడిగా ఎస్కే బుడేన్ పాషా, గుండా సత్యనారాయణ, ధరావత్ నరసింహారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షుడు సవడం వెంకటేశ్వర్లు, మారుతి ప్రకాష్, అనిల్, రామకృష్ణ, భోగా సతీష్, రమేష్, భూక్యా రత్నకుమార్, బంగారు సాయి, తంబర్ల పుల్లారావు, కొండా ప్రవీణ్, నరేష్, విజయ్, రామాచారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



కాంగ్రెస్‌లో చేరిన వారితో కోరం కనకయ్య

ఇల్లెందు: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం ఇల్లెందు మండలం మర్రిగూడెం పంచాయతీ ఏడిప్పలగూడెం గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కిన్నెర నర్సయ్య, ఆరెం కిరణ్, తాటి భిక్షం, మండల రాము, శారద తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసాని వాసికి డాక్టరేట్



కాళేశ్వరరావు

పాల్వంచ: కిన్నెరసాని గ్రామానికి చెందిన ఎంవీ కాళేశ్వరరావు కేయూలోని ఎకనామిక్స్ విభాగం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ సొల్లేటి కనకాచారి పర్యవేక్షణలో ఆయన భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన రైతులపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను డాక్టరేట్ ప్రకటించారు. కాళేశ్వరరావు గతంలో పాల్వంచలోని ప్రైవేట్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేయగా, ఆయనను పలువురు అభినందించారు.

పాలస్తీనాపై దాడులను వ్యతిరేకించండి



మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): పాలస్తీనాలో శరణార్థులుగా వచ్చిన యూదులు నేడు వారినే సొంత దేశం నుంచి తరిమికొట్టి వారి మనుగడకు ప్రమాదం తలపెట్టారని, వారి జాతిని నిర్మూలించేందుకు గాజా ప్రాంతంపై అమానుష దాడులకు ఇజ్రాయిల్ పాలపడుతోందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. గాజాపై జరుగుతున్న ఏకపక్ష యుద్ధాన్ని ప్రపంచ మానవాళి వ్యతిరేకించాలని, తమ మనుగడ కోసం పోరాటం చేస్తున్న పాలస్తీనియన్లకు యావత్ ప్రజానీకం అండదండలు అందించాలని కోరారు. నిత్యం శాంతి అంటూ కొంగజపం చేస్తున్న మోదీ ప్రభుత్వం ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో గాజాలో అమానుషమైన దాడులకు పాల్పడుతున్న యూదులకు కొమ్ము కాసే నిర్ణయం తీసుకోవటంతో మోదీ అసలు రంగును తెలియజేసిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు పాల్గొన్నారు.

పీవీకే–5 షాఫ్ట్ గని తనిఖీ



గనిని సందర్శిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5షాఫ్ట్ గనిని కార్పొరేట్ ఏరియా సెక్యూరిటీ అధికారులు తనిఖీ చేసిన విషయం ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. గత నెల 10న తిప్పనపల్లిలోని రైస్‌మిల్లులో లభ్యమైన సుమారు 4 టన్నుల ఐరన్ చానెల్స్‌పై ఉన్న కంపెనీ ముద్రలను గుర్తించి అవి పీవీకేకు చెందినవని కార్పొరేట్ సెక్యూరిటీ అధికారులు నిర్ధారించారు. కానీ ఐరన్ చానల్స్ ఈ గని నుంచి ఏమీ పోలేదని ఒక అధికారి తెలిపారు. అయితే ఈ చానల్స్ పీవీకే–5షాఫ్ట్ నుంచి తిప్పనపల్లికి ఎలా వెళ్లాయి అనే విషయం ఇప్పటికీ సెక్యూరిటీ వాళ్లు తెల్చకపోవటం విచారకరం. ఇదిలా ఉండగా, గనిలో పనుల కోసం ఏరోజుకు కావాల్సిన మెటీరియల్ ఆ రోజుకు లేదా ఆ వారానికి సరిపడా కాకుండా ఇంత మొత్తం ఎందుకు తెచ్చారనే విషయంపై కార్పొరేట్ అధికారులు ఆరా తీస్తున్నారు. ఇంత పెద్దమొత్తంలో ఐరన్ స్టాక్ ఉన్న గనికి సరైన కాంపౌండ్ వాల్ పూర్తిస్థాయిలో లేకపోవటం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.


సీపీఐ గెలుపునకు బూత్ కమిటీలు శ్రమించాలి



మాట్లాడుతున్న సాబీర్ పాషా

పాల్వంచ: వచ్చే ఎన్నికల్లో సీపీఐ గెలుపు కోసం బూత్ కమిటీ సభ్యులు శ్రమించాలని పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా అన్నారు. శుక్రవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో ఏర్పాటు చేసిన మండల, పట్టణ బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గంలో సీపీఐకి జనాదరణ ఉందన్నారు. నిత్యం ప్రజల పక్షాన పోరాడుతున్నామన్నారు. మాయమాటలతో మభ్యపెట్టే కేసీఆర్‌పై ప్రజల్లో పూర్తిగా నమ్మకం పోయిందని, ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో కేసీఆర్ విఫలమయ్యారన్నారు. కేంద్రంలో మతోన్మాద బీజేపీకి పరోక్షంగా సహకరించేందుకు సిద్ధమైన బీఆర్‌ఎస్‌ను తెలంగాణలో మనుగడ లేకుండా చేస్తామన్నారు. ఈనెల 8వ తేదీన సీపీఐ అభ్యర్థి వేసే నామినేషన్ సందర్భంగా నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమిల్లి సాయిబాబు, బండి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల నిర్ధారణ పరీక్ష



పాల్వంచ: స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష రాస్తున్న విద్యార్థులు



ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఇల్లెందురూరల్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థుల సామర్థ్యాల నిర్ధారణ పరీక్షను శుక్రవారం మండలంలోని 32 పాఠశాలల్లో నిర్వహించారు. ముందస్తు ఎంపిక చేసిన పాఠశాలల్లో 3, 6, 9 తరగతులకు చెందిన విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా పరీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇతర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు సంయుక్తంగా పరీక్షల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించారు. ఓఎంఆర్ షీట్‌లను నే రుగా తరగతులు, పాఠశాలల వారీగా జిల్లా విద్యాశాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించారు.

పాల్వంచ: దేశ వ్యాప్తంగా ప్రభుత్వం 3, 6, 9వ తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తున్న స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా శుక్రవారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు సర్వే పరీక్ష రాసారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ వై.చిన్నప్పయ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ ఎం.పూర్ణచందర్‌రావు అభినందించారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్

కొత్తగూడెంఅర్బన్: మూస ధోరణిలో ఎన్నికల్లో ఎప్పుడూ ఒకే వ్యక్తిని ఎన్నుకోవడం వలన అభివృద్ధి కుంటుపడుతుందని బీఎస్పీ కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, అడ్వకేట్ యెర్రా కామేష్ అన్నారు. శుక్రవారం మన కొత్తగూడెం – మన కామేష్ కార్యక్రమంలో భాగంగా ఆయన కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 16, 17, 18వ వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కామేష్ మాట్లాడుతూ.. కొత్తతరం నాయకులను ఎన్నుకోవడం ద్వారా యువరక్తాన్ని చట్టసభలకు పంపించిన వారు అవుతారని తెలిపారు. దేశ భవిష్యత్ యువతరం చేతుల్లోనే ఉందని, వారికి ఒక అవకాశం ఇవ్వాలని సూచించారు. అనంతరం వ్యాపార వేత్త, శివాలయం అధ్యక్షుడు మాలోత్ రాజుకు బీఎస్పీ కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాలోత్ వీరునాయక్, తాటిపల్లి శ్రావణ్, శెట్టి రాంబాబు, శారద, పద్మ పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు కృషి చేద్దాం..

ఇల్లెందు: ఉద్యమంలో చివరి వరకు పోరాడి అసువులు బాసిన అమరుల బాటలో పయనించటమే వారికి మనం అర్పించే నివాళులు అని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ సెంటర్‌లోని పగడాల వెంకన్న స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో చంద్ర అరుణ, యాకుబ్‌షావలీ, మల్లెల వెంకటేశ్వర్లు, పాయం వెంకన్న, పృథ్వీ, శేషన్న, వీరన్న, మల్లేష్, రఘు, పాషా, రామారావు పాల్గొన్నారు.

టేకులపల్లి: భూమి, భుక్తి, పీడిత ప్రజల విముక్తి కోసం సాగుతున్న విప్లవోద్యమంలో అసువులు బాసిన అమరవీరుల ఆశయాల సాధనకై పోరాడాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు బానోతు ఊక్లా, మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు, ఐఎఫ్టీయూ రాష్ట్ర నాయకుడు దుబాకుల ప్రసాద్ పిలుపునిచ్చారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం టేకులపల్లి మండల కేంద్రంలోని కాచినపల్లి అమరవీరుల స్తూపం దగ్గర ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు భూక్యా హర్యా జెండా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ... విప్లవోద్యమంలో నవంబర్లోనే అనేకమంది వీరులు అయ్యారని, ప్రతి సంవత్సరం ఒకటి నుండి తొమ్మిది వరకు సంస్మరణ సభలను నిర్వహించుకుంటున్నామన్నారు. వారి ఆశయం దున్నే వాడికి భూమి కావాలి.. పీడిత రాజ్యం రావాలంటే నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. వారి ఆశయం కోసం ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కాచినపల్లిలో బూటకపు ఎన్‌కౌంటర్‌లో నంబూరి సీతారామారావు, సుసేనక్క, చింతా లక్ష్మి, నోముల పరశురాములు, కోటన్న అమరులయ్యారన్నారు. వారి త్యాగం వృథా కాదని ఎల్లకాలం జీవిస్తారని, వారు చిరంజీవులన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ డివిజన్ కార్యదర్శి నోముల భానుచందర్, ఇస్లావత్ రమేష్, సజ్జన్, బస్సీ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: భూమి, భుక్తి, పీడిత ప్రజల విముక్తి కోసం విప్లవోద్యమంలో అసువులు బాసిన వీరుల ఆశయ సాధనకు ఉద్యమిద్దామని న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని రేపల్లెవాడ గ్రామంలో ఎల్లన్న స్తూపం వద్ద ఎర్రజెండా ఎగురవేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. పేదలకు పోడు భూములు పంచిపెట్టడంలో ఎల్లన్న కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో కొక్కు సారంగపాణి, వెంకన్న, సైదులు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఇల్లెందురూరల్: ఎల్లన్న స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్డీ కార్యకర్తలు



టేకులపల్లిలో అమరవీరులకు జోహార్లు అర్పిస్తున్న నాయకులు



ఇల్లెందు: నివాళులర్పిస్తున్న గుమ్మడి నర్సయ్య తదితరులు